# పట్టు పరికిణీ

తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

"అమ్మా! వంటిల్లు రేప్పొద్దున్న కడుగుదామే. చలేస్తోందీ!" తామందరూ అన్నాలు తిన్న కంచాలు కడిగేసి, గూట్లో బోర్లించి, గుమ్మం దగ్గర ముడుచుకు కూర్చుంటూ గారంగా అన్నది అపర్ణ.

"ధనుర్మాసం చలికి మనుషులు ధనుస్సులా వంగిపోతారని అంటారు" అంటూ నవ్వింది భోజనం చేస్తున్న పార్వతమ్మ.

"రాత్రిళ్లు దేవతలు వచ్చి చూస్తార్ట తల్లీ! వంటిల్లు శుభ్రంగా కడిగి, ముగ్గేసి ఉంచకపోతే కోపగించి, శాపం పెట్టి పోతార్ట." మజ్జిగ అన్నంలోకి నంచుకోను ఆవకాయ ముక్క వేసుకుంటూ మళ్లీ తానే అంది పార్వతమ్మ.

"నువ్వు కూడా మాతోబాటు తినేస్తే తొందరగా పనులు అయిపోతాయి గదా అంటే వినవు." అపర్ణ ముద్దుగా విసుక్కుంది.

"అదెలాగే? మీ నాన్న గారికి ఎడమ చేతితో వడ్డన చేయమంటావా నన్ను? అయినా మీ అందరికీ నా చేతులతో పెడితేగానీ నాకు తృప్తిగా ఉండదు సుమా..." భోజనం ముగించి లేస్తూ అంది పార్వతమ్మ.

తల్లీ కూతుళ్లిద్దరూ కలిసి వంటిల్లు కడిగి ముగ్గు పెట్టి పడుకునేసరికి పది గంటలు దాటింది.

ఆ సరికి పార్వతమ్మ భర్త శివరావు, కొడుకు రవి, చిన్న కూతురు శర్వాణి మంచి నిద్రలో ఉన్నారు.

"నన్ను మాత్రం పొద్దున్నే లేపకు బాబూ" అంటూ దుప్పటి ముసుగు పెట్టింది అపర్ణ.

"నాకేం... నీ ఇష్టం... నా కొచ్చిన పిచ్చి ముగ్గు పెడతాను. మళ్లీ ఎదురింటి హైమ మన కన్న పెద్ద ముగ్గు పెట్టిందని గోల పెడితే లాభం లేదు." కూతురి పక్కనే నడుము వాలుస్తూ, నవ్వు గొంతుతో అంది పార్వతమ్మ.

"అయ్యో రామా! మరిచే పోయాను. రేపు నేను పదిహేను చుక్కల నక్షత్రం ముగ్గు పెట్టాలనుకున్నాను. హైమకు అంత పెద్ద ముగ్గు రాదులే. అమ్మా! తొందరగా లేపడం మర్చిపోకేం?" ముఖం మీది నుండి దుప్పటి తప్పించి ఉత్సాహంగా అంది అపర్ణ.

"అలాగా దొరికి" అని నవ్వి, లేచి వెళ్లి పక్క గదిలో పడుకున్న తండ్రీ కొడుకుల కోసం మంచినీళ్ల చెంబూ, గ్లాసూ పెట్టి వచ్చి పడుకుంది పార్వతమ్మ.

*** *** ***

"అమ్మా! ఈ సంక్రాంతి కైనా పట్టు పరికిణీ కుట్టించవూటే?" తల్లి మెడ చుట్టూ చేతులు వేసి గారంగా అడిగింది అపర్ణ.

కూతురు ముగ్గు పెడుతుంటే రంగులు నింపుతున్నది పార్వతమ్మ.

నలభై మూడో ఏడు దాటిన పార్వతమ్మ కొద్దిగా కాయురాలైనఆ, శలాకలా ఉన్న పదహారేళ్ల కూతురితో సమానంగా ఉత్సాహంగా రంగవల్లులు దిద్దుతున్నది.

అపర్ణ మాటల కావిడ చిన్నగా నిట్టూర్చింది. "అలాగే చూద్దాంలే... నాన్నగా రేవంటారో..."

"అమ్మా... ఎరుపు రంగుకు నీలం అంచు మీద జరీ పువ్వులున్న పట్టు పరికిణీ కావాలే. హైమ నిరుడు సంక్రాంతికి కుట్టించుకుంది చూడు - అలాటిది కావాలి" పట్టు పరికిణీ కట్టుకున్నట్టే మురిసిపోతూ అంది అపర్ణ.



"నరేలే... ముందు ఈ పని త్వరగా కానీ... మళ్లీ మీ నాన్న గారికి కాఫీకి ఆలస్య మవుతుంది." మాట మారుస్తూ అన్న దావిడ.

"నువ్వెళ్లి చెల్లాయిని లేపమ్మా. ఇద్దరం కలిసి వేణుగోపాలస్వామి గుడికి వెళ్లి వస్తాం." ఉత్సాహంగా అంది అపర్ణ.

"భక్తి దేవుడి మీదేనా? లేక చక్కెర పొంగలి మీదనా?" అంటూ నవ్వి లోపలికి వెళ్లింది పార్వతమ్మ.



ముగ్గు మీద గొబ్బిళ్లు పెట్టి, పెరట్లో పూచిన బంతిపువ్వులు అలంకరించి, దూరంగా నిలబడి ముగ్గు అందాన్ని మురిపెంగా చూసుకుని, హైమ వేసిన ముగ్గు కన్న తన ముగ్గే బాగుందన్న సంతోషంతో లోపలికి పరిగెత్తింది అపర్ణ.

భోగిమంటల వెచ్చదనాన్ని తెచ్చి ఇచ్చిన సంక్రాంతి వెళ్లిపోయింది.

శివరాత్రి వచ్చే సరికి "శివా శివా" అంటూ చలి పారిపోయింది.

ఉగాది వచ్చేసరికి పరీక్షల హడావుడి మొదలయ్యింది. ఆ హడావుడిలో పట్టు పరికిణీ గురించి పట్టుబట్టలేదు అపర్ణ.

ఉగాది రోజున మామిడికాయ ముక్కలూ, వేప పూత, కొత్త చింతపండు గుజ్జూ, కొత్త బెల్లం వేసి చేసిన ఉగాది పచ్చడి ముందుగా తినందే పులిహోర, బొబ్బట్లు తిన నివ్వలేదు ఎవర్నీ పార్వతమ్మ. జీవితంలో చేదూ, తీపీ ఉంటాయని చెబుతుందట ఉగాది పచ్చడి. పండుగ రోజు మధ్యాహ్నం అపర్ణ తల్లితో మల్లె పువ్వుల జడ వేయించుకుంది.

సైన్సు పుస్తకం చేతిలో పట్టుకుని చదువుకుంటూ కూర్చుంది అపర్ణ తల్లి తనకు జడ కుడుతున్నంత సేపూ.

పొడుగాటి జడ చివర జడ గంటలు పెట్టి అల్లింది పార్వతమ్మ. మూడు వరుసలు మల్లెమొగ్గలూ ఒక వరున కనకాంబరాలూ, మళ్లీ మూడు వరుసలు మల్లెలు ఒక వరున దవనం, మరువం ఆకులూ పెడుతూ పూలజడ పూర్తి చేసే సరికి పార్వతమ్మకు నడుము పట్టుకుపోయింది.

జడ అందం చూసి నొప్పి మాట మరిచిపోయి పిడికెడు ఉప్పు తెచ్చి తీసి కుంపట్లో వేసింది.

మెడ అటూ ఇటూ కదపకుండా నిటారుగా పెట్టి నడుస్తూ పూల జడ స్నేహితురాలికి చూపించి రావడానికి హైమ ఇంటికి బయల్దేరింది అపర్ణ.

*** *** ***

ఆఖరి పరీక్ష రాసి వచ్చిన రోజున అపర్ణ పెద్ద మనిషి అయింది.

"పాపం పిచ్చి పిల్ల! ఏడాదిగా పట్టు పరికిణీ కోసం గోల పెడుతోంది. ఇప్పుడైనా దాని ముచ్చట తీర్చుదా మండీ!" భర్తను బ్రతిమలాడింది పార్వతమ్మ.

"చూడు పార్వతీ! నాకు మాత్రం దాని కోరిక తీర్చాలని లేదూ? కానీ అంత డబ్బు ఎక్కడి నుండి తెచ్చేది చెప్పు? ఎంత లేదన్నా ఇరుగు పొరుగూ నాలుగిళ్ల వాళ్లనైనా భోజనానికి పిలవా లంటున్నావు. అమ్మాయికి కొత్త బట్టలు కావాలి. ఈ ఖర్చులకే అప్పు కోసం ఎవర్ని అడగాలా అని బెంగ పడుతున్నాను." నిస్సహాయంగా అన్నా డాయన.

ముందు గదిలో నుండి తల్లిదండ్రుల సంభాషణ వింటూనే ఉంది అపర్ణ.

ఆ పిల్లకు నిరాశతో కళ్లలో నీళ్లు తిరిగాయి.

తల్లి సాయంకాలం బజారుకు వెడుతూ - "ఏ రంగులో తెమ్మంటావే బట్టలు?" అని అడుగుతే "నీ ఇష్టం" అంది నిర్లిప్తంగా.

పార్వతమ్మ తిరిగి వచ్చేసరికి చీకటి పడింది.

"అదేమి టమ్మా... చీకట్లో కూర్చున్నావు? శర్వాణి ఏదీ? సంధ్య వేళ దీపం వేయకుండా ఏం చేస్తోంది?" నొచ్చుకుంటూ లోపలికి వచ్చింది పార్వతమ్మ.

పెరటి తలుపు చేరవేసి, వీధి తలుపు తెరిచి ఉంచి స్విచ్ వేసింది.

"దీపాలు వెలిగించగానే వీధి గుమ్మం ద్వారా లక్ష్మి లోపలికి వస్తుంది. పెరటి తలుపు తీసి ఉంటే ఆవిడ అటు నుండి వెళిపోతుంది" అంటూ కూతుళ్లకు చెప్పేం దావిడ.

దీపం వెలగగానే చేతులు జోడించి నమస్కరించింది పార్వతమ్మ - "దీపం జ్యోతిః పరబ్రహ్మం। దీపం సర్వ తమోపహం, దీపేన సాధ్యతే సర్వం, సంధ్యా దీప నమోస్తుతే" అని చెప్పుకుంటూ.

"పక్కింటి రుక్మిణి మీ అపర్ణకు ఈ పసుపు రంగు పరికిణీ మీద ఆకుపచ్చ పమిట బాగుంటా యంది. నీకు నచ్చాయా చూడు" అంటూ దూరం నుండే బట్టలు అపర్ణకు చూపించింది.

"బాగానే ఉన్నాయి." నిరుత్సాహంగా అంది అపర్ణ.

"పట్టు పరికిణీ గుడ్డలు , ఇప్పుడు మంచి రకాలు లేవుటే... దసరాకు మంచి కొత్త రకాలు తెప్పిస్తా నన్నాడు." ఓదార్పుగా అం దావిడ.

అపర్ణ మాట్లాడలేదు.

"మధ్యాన్న మనగా అన్నం తిన్నావు. ఆకలేస్తోందో ఏమిటో? ఒక్క నిముషంలో అన్నం పెడతాను" అంటూ వంటింట్లోకి నడిచింది పార్వతమ్మ.

ఆ సమయంలో కూతురు కారం తినకూడదని పెసరపప్పు, బియ్యం కలిపి పులగం వండి, మరికాస్త నెయ్యి వేసి అపర్ణకు పెట్టింది.

*** *** ***

సెలవులు ముగిసి స్కూళ్లు, కాలేజీలు తెరిచారు.

హైమ పక్క నున్న పట్నంలో కాలేజీలో చేరింది.

అపర్ణ అదృష్టం కొద్దీ ఆ ఊళ్లో హైస్కూలులోనే జూనియర్ కాలేజీ పెట్టారు.

ఎలాగో తండ్రిని ఒప్పించి ఇంటర్‌లో చేరింది అపర్ణ.

కొడుకును పక్క నున్న పట్నంలో పాలిటెక్నిక్ కాలేజీలో చేర్పించాడు శివరావు.

పట్నంలో చదువుతున్న హైమ, వాళ్ల వదిన దగ్గర ఉండకుండా హాస్టల్లో చేరడం విచిత్రంగా అనిపించింది అపర్ణకు.

హైమ వాళ్ల పెద్దన్న ఏడాది క్రిందట కారు ప్రమాదంలో చనిపోయాడు. అతని ఆఫీసులోనే వాళ్ల వదినెకు చిన్న ఉద్యోగం ఇచ్చారు.

భర్త పోయాక ఆవిడ బొట్టూ, గాజులూ తీయకపోవడం, ఉద్యోగం చేయడం గురించి పల్లె - పట్నం కాని తమ ఊళ్లో వింతగా చెప్పుకోవడం అపర్ణకు తెలుసు.

అపర్ణ అత్తయ్య లలిత కూడా చిన్న

వయసులోనే భర్తను పోగొట్టుకుని పుట్టింటికి చేరింది.

నిండా ఇరవై సంవత్సరాలు లేని చెల్లెలికి వైధవ్యం పేరిట జుట్టు తీయడం, తెల్ల చీరెలు కట్టించడం వంటివి కుదరవని కచ్చితంగా వాళ్ల అత్త వారింటి వారికి చెప్పి చెల్లెల్ని తీసు కొచ్చేశాడు శివరావు.

ఇంటికి పెద్ద కొడుకుగా చెల్లిలి బాధ్యత తన మీదే వేసుకుని ఆమె కొడుకును తన దగ్గరే పెట్టుకుని స్కూల్లో చేర్పించాడు.

లలిత తల్లిదండ్రుల వద్దనే పల్లెలో ఉండిపోయింది. ఆ పిల్లతో ఎలాగైనా మెట్రిక్యులేషన్‌కి కట్టించాలని పుస్తకాలు కొనిచ్చి చదువుకోమని నచ్చ చెప్పి వచ్చాడు శివరావు.

బొట్టులేని అత్తయ్య ముఖం చూచి నప్పుడల్లా అపర్ణ మనసు విలవిల లాడుతుంది.

"హైమా వాళ్ల వదినెలా అత్తయ్య కూడా కొంచెమయినా చదువుకుని ఉంటే బాగుండేది కదమ్మా?" అంటూ ఉంటుంది అపర్ణ తల్లితో.

*** *** ***

అదిగో ఇదిగో అంటుండగానే శ్రావణ మాసం వచ్చేసింది.

కొత్తగా పెళ్లైన అమ్మాయిలు శ్రావణ మంగళవారం నోములు నోచుకుంటున్నారు.

శ్రావణ పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతం. పార్వతమ్మ అత్త వారింట్లో వరలక్ష్మీ వ్రతం ఆనవాయితీ లేనందున ఆవిడ పక్కింటికి వెళ్లి పువ్వులు, అక్షింతలు వేసి దేవికి నమస్కరించి వచ్చింది.

సాయం కాలం పేరంటానికి వెళ్లాలని తల్లీ కూతుళ్లు ముస్తాబు అవుతున్నారు.

"అమ్మా చూడవే... నాకు పచ్చ చామంతులు కావాలంటే తెల్ల చామంతుల దండ పెడుతోంది అక్క" అంటూ శర్వాణి తల్లితో ఫిర్యాదు చేసింది.

"ఏదో ఒకటి పెట్టుకుని తొందరగా బయల్దేరుతారా?" తన కున్న ఒక్కగా నొక్క పట్టు చీరె కట్టుకుని, సిగముడిలో చామంతులు తురిమి మహాలక్ష్మిలా తయారైన పార్వతమ్మ పిల్లల్ని గదిమింది.

"నీ చిన్న కూతుర్నే తీసుకొని వెళ్లు. నేను పేరంటానికి రానే రాను. అందరూ చక్కగా పట్టు పరికిణీలు వేసుకు వస్తే నేను మాత్రం ఈ ముష్టి బట్టలు వేసుకుని రావాలి." కోపంగా అంది అపర్ణ.

"శుక్రవారం పూట అవేం మాటలే? ఈసారి దీపావళికి నీకు పట్టు పరికిణీ కుట్టించకపోతే నా మీద ఒట్టే. సరేనా? మా అమ్మవు కదూ! త్వరగా తెమిలిరా తల్లీ..." పార్వతమ్మ కూతుర్ని బుజ్జగించింది.

అపర్ణ మనసులో ఆశ తళుక్కుమంది. "అమ్మ ఒట్టు పెట్టుకున్నదంటే మాట తప్పదు" అన్న నమ్మకం కుదిరి గబగబ ముస్తాబై పేరంటానికి బయల్దేరింది.

పేరంటానికి హైమ పంజాబీ డ్రెస్ వేసుకుని వచ్చింది.

రెండ్రోజులు కాలేజీ ఎగ గొట్టి వచ్చింది హైమ.

"ఇంచక్కా పట్టు పరికిణీ కట్టుకుంటా వనుకున్నా... ఇదేం డ్రెస్ బాబూ?" అంది అపర్ణ.


"పట్టు పరికిణీలు పాతకాలం వాళ్లకు. ఇప్పు డెవరూ అది వేసుకోరు." కొంచెం గర్వంగా అంది హైమ.

"నా చేయి చూశావా? గోరింటాకు ఎంత బాగా పండిందో?" మాట మార్చింది అపర్ణ.

"అబ్బా! ఆ గోరింటాకు రుబ్బడం, గంటల కొద్దీ చేతులకు పెట్టుకుని కూర్చోవడం పరమ బోర్ బాబూ!" అంటూ పొడుగ్గా పెంచుకున్న గోళ్ల కున్న నెయిల్ పాలిష్ చూసుకుంది హైమ.

ఆ పిల్ల జుత్తు కూడా భుజాల క్రింది దాకా మాత్రం ఉండేలా కత్తిరించుకున్నదని గమనించింది అపర్ణ.

"ఇంటర్ అయ్యేక ఇంకా చదువుతావా?" కుతూహలంగా స్నేహితురాలిని చూస్తూ అడిగింది.




"ఆ! ఎంట్రెన్స్ పరీక్ష రాసి మెడికల్ కాలేజీలో చేరుతాను. ఎలాగైనా డాక్టర్నవ్వాలి." దృఢంగా అంది హైమ.

"నువ్వేం చేస్తావ్? మీ వాళ్లు నీకు పెళ్లి సంబంధాలు చూసేస్తున్నారా ఏం?" అపర్ణను అడిగింది హైమ.

ఆ అడగడంలో కాస్త వెక్కిరింత ఉన్నట్టు తోచింది అపర్ణకు.

"అదేం లేదు. నేనూ చదువుకుంటా. అదిగో అమ్మ పిలుస్తోంది. నేను వెళ్తున్నా..." అంటూ లేచి వచ్చేసింది.

పిలిచిన వాళ్లందరి ఇళ్లకూ వెళ్లి, వాయనంగా ఇచ్చిన నానబెట్టిన శనగలు జేబు రుమాళ్లలో మూటకట్టుకుని చీకటి పడుతుండగా ఇంటికి చేరారు తల్లీ కూతుళ్లు.

అపర్ణ సరాసరి గదిలోకి వెళ్లి పడుకుంది.

"పెళ్లి కావలసిన పిల్లవు. మన పద్ధతులు నేర్చుకోవద్దూ? ముని మాపు వేళ ఆ పడ కేమిటి? లేచి వెళ్లి కాళ్లు కడుక్కుని దేవుడి ముందు దీపాలు వెలిగించు." గదమాయించింది పార్వతమ్మ.

"నీ వన్నీ చాదస్తాలే... అయినా నే నిప్పుడే పెళ్లి చేసుకోవడంలేదు. చదువుకుంటాను." అపర్ణ రోషంగా అంది.

"మీ అన్నయ్య చదువయ్యే సరికి మీ అత్తయ్య కొడుకు హైస్కూలు కొస్తాడు. మగపిల్లల చదువులకే దిక్కులేదు. ఇక నీకు పెద్ద చదువులు ఎక్కడ చెప్పించగలన్మ తల్లీ?" అన్నాడు శివరావు.

అపర్ణ బదులు పలకకుండా దిండులో ముఖం దాచుకుంది.

*** *** ***

అక్టోబరులో దసరా సెలవులకు హైమ వచ్చిందని తెలిసి వా ళ్లింటికి వెళ్లింది అపర్ణ.

"హైమా! పట్నం నుండి ఏమైనా కొత్త బొమ్మలు తెచ్చావా? అక్క డంతా కొత్త రకాలుగా బొమ్మలు పెడతార్ట కదూ?" కుతూహలంగా అడిగింది.

టిఫిన్ ప్లేటు ఒళ్లో పెట్టుకుని, మంచం మీద కూర్చుని, కాళ్లూపుతూ, ఇంగ్లీషు పత్రికలో బొమ్మలు చూస్తూ తింటున్న హైమ నిర్లక్ష్యంగా తలెగరేసింది.

"హూ కేర్స్? ఈ పాత చింతకాయ పచ్చడి అలవాట్లకు నాకు టైమెక్కడిది?" అంది పుస్తకం మీద నుండి దృష్టి మరల్చకుండానే.

అపర్ణ ఉత్సాహం కాస్తా నీరుగారిపోయింది.

"సరే గానీ... అలా కాళ్లూపితే అరిష్టమని మీ అమ్మ తిట్టదూ? పైగా టిఫిన్ పళ్లెం ఒళ్లో పెట్టుకున్నావు." మందలింపుగా అంది.

"నీ పల్లెటూరి నమ్మకాలూ, చాదస్తాలూ మాత్రం పోవు గదా! హాస్టల్లో నలుగురిలో ఉంటూ అంటూ సొంటూ అంటే నవ్వుతారు" అంది హైమ విసుగ్గా.

అపర్ణ నిరుత్సాహంగా ఇంటికి తిరిగి వచ్చింది. ఆ పిల్ల వచ్చేసరికి పార్వతమ్మ బొమ్మల పెట్టె అటక మీది నుండి దింపి ఒక్కో బొమ్మా జాగ్రత్తగా బయటకు తీసి పెడుతోంది.

బొమ్మల్ని చూసే సరికి అవర్ణకు ఉత్సాహం కలిగింది.

సీతారామ లక్ష్మణులు, శివపార్వతులు, మురళీకృష్ణుడు, లక్ష్మీదేవి, సరస్వతి - అందర్నీ చెక్క పెట్టెల్ని పేర్చి తయారుచేసిన మెట్ల మీద తెల్ల దువ్వటి పర్చి అమర్చారు.

శర్వాణి తన స్నేహితురాలి ఇంట్లో చూసి వచ్చిందట. మెట్లకు ఒక పక్కన నేల మీద ఇసుకపోసి పార్కులా కట్టి అందులో గౌను వేసుకున్న దొరసాని బొమ్మని కూర్చోబెట్టింది.

బొమ్మల కొలువుల సంరంభంలోనూ అవర్ణ పట్టు పరికిణీ గురించి మరచిపోలేదు.

దీపావళి కోసం ఎదురుచూస్తోం దా పిల్ల.

*** *** *** ***

"ఈసారి అట్ల తదియకు రుక్మిణి పిన్ని మనతో బాటు ఊయల లూగుతుందిట..." సంబరంగా చెప్పింది శర్వాణి.

"వాళ్ల బామ్మ ఒప్పుకోవద్దూ?" అంది అవర్ణ అనుమానంగా.

రుక్మిణి, వాళ్ల పక్కింటి వాళ్ల కోడలు. చిన్నప్పుడే పెళ్లి చేయడం వలన ఇరవై ఏళ్లకే ఇద్దరు పిల్లల తల్లి అయింది.

వాళ్లది ఉమ్మడి కుటుంబం. అత్త, మామ, బావగార్లు, తోడికోడళ్లు కాకుండా మామ గారి తల్లి ఎనభై ఏళ్ల ముసలావిడ కూడా ఉంది.

ఆవిడకు పన్నెండో ఏట కొడుకు పుట్టగానే భర్త పోయేట్ట. 'సకేశ' మడికి పనికి రాదు గనుక ఆ వయసుకే ఆమెకు జుత్తు తీయించి మడి బట్ట కట్టించేరు. ఆ రోజు మొదలు వంటిల్లే ఆవిడ లోకం. చాదస్తాలు చూస్తే భోలెడు. ఆరు నూరైనా చన్నీళ్ల స్నానం, ఒంటిపూట భోజనం తప్పదు.

నెలలో మూడు రోజులు కోడళ్ల పాట్లు చెప్పనలవి కాదు.

వాళ్లు కనబడినా, మాట వినబడినా ఆమె ఆ పూట భోజనం చేయదు. చంటిబిడ్డ తల్లి అయిన రుక్మిణి కూడా ఆ రోజులలో ఒంటి గంట దాకా కాఫీ నీళ్లతో ఉండాల్సిందే. పూజా, నైవేద్యం, ఆవిడ భోజనం అయ్యేక ఆ పిల్లకి తిండి.

పార్వతమ్మ చాటు మాటుగా రుక్మిణికి ఏదన్నా ఫలహారం అందిస్తుంటుంది.

అట్ల తద్ది రోజు అవర్ణా, శర్వాణీ తెల్లవారు జామునే లేచి గోంగూర పచ్చడీ, పెరుగన్నం తినేసి ఆటలకు బయల్దేరారు.

పెరట్లో మామిడి చెట్టుకు ఊయల కట్టి, రుక్మిణి పిన్నితో కలసి ఊగారు.

సాయంత్రం చంద్రోదయం తరువాత అమ్మ అట్లు పోసి ఇస్తే రుక్మిణికి వాయనం ఇచ్చింది అవర్ణ.

"దీపావళి పండుగ దాటగానే వచ్చేది కార్తీక మాసం కదక్కా. కార్తీక సోమవారం వన భోజనానికి వెళ్దామా?" ఉత్సాహంగా అడిగింది రుక్మిణి పార్వతమ్మను.

"దీపావళికి పట్టు పరికిణీ కుట్టిస్తావు కదూ? అది కట్టుకుని వస్తాను వన భోజనానికి..." అంది అవర్ణ సంబరంగా.

"సరదా పడినట్టు కాదు. పగలంతా ఉపవాస ముండగలవూ?" కవ్వించింది రుక్మిణి.

"ఉండకేం? పది రోజు లయినా పస్తు లుండగలను." పంతంగా అంది అవర్ణ.

"అవేం మాటలే" తలుపు దగ్గర తథాస్తు దేవత లుంటారు. తథాస్తు అంటార్ట. అశుభం పలక్కూడదు" అంది పార్వతమ్మ నొచ్చుకుంటూ.

తథాస్తు దేవతలు పలికారో, ఏమో గానీ మర్నాటి నుండే అవర్ణ జ్వరంతో పడుకుంది.

పది రోజులైనా జ్వరం దిగలేదు. పార్వతమ్మ బెంగ పడిపోయింది.

ఒక అర్ధరాత్రి మెలకువ వచ్చిన అవర్ణ తల్లి వెంకటేశ్వరస్వామి పటానికి దండం పెట్టి - "స్వామీ! ముక్కుపచ్చలారని ఈ పిల్లను కాపాడు. కావాలంటే నన్ను తీసుకుపో తండ్రీ" అంటూ మొక్కుకోవడం చూసింది.

నిశ్శబ్దంగా కన్నీళ్లు పెట్టుకుంటున్న కూతుర్ని చూసి నిరసం కొద్దీ ఏడుస్తోం దనుకుని తల్లడిల్లింది తల్లి.

పదిహేనో రోజు అవర్ణకు జ్వరం తగ్గింది. ఆ పిల్లకు పథ్యం పెట్టిన రోజే గుండె పోటుతో పార్వతమ్మ కన్నుమూసింది.

*** *** ***

మళ్లీ సంక్రాంతి వచ్చింది. ఆ సంవత్సరం అవర్ణ వాళ్లింట్లో ఏ సందడీ లేదు. సెలవులకు హైమ వచ్చింది.

"మా వదిన మరో పెళ్లి చేసుకుంది తెల్సా? చిన్నన్నయ్య అమెరికాలోనే ఉండిపోతా డట. నేనూ నా చదువైపోయాక అమెరికా వెళ్లిపోతాను" అంది హైమ.

"పాపం మీ అమ్మా, నాన్నల మాట ఏమిటి? ముసలితనంలో వాళ్ల నెవరు చూస్తారు?" అనడిగింది అవర్ణ.

"వాళ్ల కోసం నా భవిష్యత్తు వదులుకోవడం మూర్ఖత్వం" అంది హైమ.

రుక్మిణి వాళ్లింట్లో ముసలావిడ కన్ను మూసింది. ఉగాది ముందు భర్తను పోరు పెట్టి వేరు కాపురం పెట్టింది రుక్మిణి. ఉమ్మడి సంసారం మూడు కుటుంబా లయింది. వేరు కాపురం పెట్టేక వచ్చే జీతం చాలక, పిల్లలతో చేసుకోలేక సతమత మవుతోంది రుక్మిణి. ఆమె అట్లతద్ది ఊసే మరచిపోయింది.

దసరా తరువాత అవర్ణ అత్తయ్య లలిత అన్న గారి ఊరు వచ్చి స్త్రీ శిశు సంక్షేమ శాఖలో కుట్టు టీచరుగా చేరింది. అన్న గారి సలహా మేరకు పరీక్షకు కట్టడం వలన ఆ ఉద్యోగం వచ్చింది.

దీపావళికి ముందే పార్వతమ్మ సంవత్సరీకం ముగిసింది. పండుగ ముందు శివరావు భార్య పట్టు చీరెను తీసి కూతురి చేతిలో పెట్టి "దీనితో పరికిణీ కుట్టించుకో తల్లీ! మీ అమ్మ చెప్పిపోయింది" అన్నాడు విషాదంగా.

ఆ చీరెను అపురూపంగా బుగ్గలకు అనుకుంది అవర్ణ. అమ్మ చేయిలా మెత్తగా, అమ్మ ప్రేమలా హాయిగా ఉన్న దా స్పర్శ.


అవర్ణ కళ్లలో నీళ్లు తిరిగాయి. "ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ అయిపోతే టీచర్ ట్రైయినింగ్‌లో చేరుతాను నాన్నా. ఇక పరికిణీలు ఎందుకు నాకు?" అంది తలవంచుకుని.

"అక్కా! నాకు పట్టు చుడీదార్, కమీజు కుట్టించవూ? ఇప్పుడు మా స్కూల్లో చాలా మంది అవే వేసుకుంటున్నారు" అంది శర్వాణి.

ఆ రాత్రి భోజనాలు అయ్యాక "అక్కా! కంచాలు టేబులు మీదే వదిలేద్దామే. రేపు కడుగుదాం. చలిగా ఉంది" అంది శర్వాణి.

హైమ వాళ్లు కొత్త డైనింగ్ టేబులు కొన్నారని పాత టేబులు బలవంతంగా అవర్ణ వాళ్ల కిచ్చారు. ఇప్పుడు వాళ్లు టేబులు మీదే తింటున్నారు భోజనం.

"రాత్రి పూట దేవతలు వచ్చి చూస్తార్ట చెల్లీ! వంటిల్లు శుభ్రంగా ఉంచకపోతే శాపం పెడతార్ట!" కంచాలు తీసి కడిగి, టేబులు మీద నీళ్లు చిలకరించి తడి బట్టతో తుడుస్తూ అంది అవర్ణ.



## ఎడిసన్ గొప్పతనం

థామస్ ఆల్వా ఎడిసన్ గొప్ప పరిశోధకుడే కాక పారిశ్రామికవేత్త కూడా. 1914లో ఎడిసన్ ఇండస్ట్రీస్ ఉచ్ఛ దశలో ఉన్న సమయంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగి ఫ్యాక్టరీ అంతా తగలబడటమే కాక, ఆయన జీవిత కాలంలో పరిశోధన చేసి రూపొందించిన వ్యాసాలన్నీ కాలిపోయాయి. ఆ మర్నాడు తగలబడిన అవశేషాల గుండా నడుస్తూ "అగ్ని ప్రమాదాలు కూడా ఒకందుకు మంచివే! గతంలో మనం చేసిన తప్పులన్నీ ఇంతటితో రూపుమాసిపోయాయి. గతానుభవంతో మళ్లీ కొత్త పరిశోధనలు సాగించవచ్చు" అన్నాడట ఎంతో ధైర్యంగా 67 సంవత్సరాల ఎడిసన్!

సేకరణ : డి.మూర్తి